
# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక
జులై-2013
₹15/-

బాలి ప్రత్యేక సంచిక




**మన మీద అలిగి దూరంగా వెళ్ళిపోయిన**

**మన బాలిగారి ప్రతిభను**

**మరొక్కసారి వీక్షిద్దాం!**

స్వచ్ఛమైన చిరునవ్వుకి... అచ్చమైన చిరునామా...

# హాస్యానందం

సంపూర్ణ హాస్య మాస పత్రిక


**జులై-2013**

| | | |
|---|---|---|
| *Publisher&Editor* | : | Ramu.P |
| *Associate Editor* | : | Sudharani.P |
| *Cartoon Editor* | : | A.V.M |
| *Well Wishers* | : | Tanikella Bharani<br>Jaydev<br>Mallik |
| *Full Pillar* | : | Bnim |
| *Designing* | : | Creative Graphix |
| *Creative Team* | : | Tumbali Sivaji<br>T.Chandra Sekhar<br>Rampa<br>Surya Dubey<br>P.V.Narayana<br>Ramsheshu<br>P.Priyatham<br>Mallikarjun.U |
| *Helper* | : | Raviteja.S |
| *Address* | : | HASYANANDAM,<br>#8-215/4,<br>Near Ramalayam,<br>Po:YERRABALEM<br>Pin 522 503,<br>Mangalagiri Mandal,<br>Guntur dist. |
| *Ph* | : | 9849630637 |

email: hasyanandam @yahoo.com

| | | |
|---|---|---|
| *Hyderabad & Telangana Marketing* | : | Charminar News Agency,<br>1-6-176/1, M.G.Road,<br>Khandoji Bazar,<br>Secunderabad-3.<br>Ph:9346515813 |
| *And* | : | Shams News Agency,<br>Abids, Hyderabad.<br>Ph:040-30680840/41 |




## హాయ్... సానందంగా...

హాస్యానందం ఆప్తులకు,అభిమానులకు... హాస్యాభివందనాలు.

హాస్యానందం మన చిత్రకారుల... కార్టూనిస్ట్‌ల ప్రత్యేక సంచికలు రూపొందించి ఇతర పత్రికలకూ మార్గ దర్శకం కావడం ముదావహం.


ఈ సత్సంప్రదాయంలో ఈ సంచిక మన సుప్రసిద్ధ చిత్రకారులు, కార్టూనిస్ట్ అయిన బాలిగారి ప్రత్యేక సంచికగా రూపొందించాం!

కార్టూన్‌కి ఐడియా ప్రాణం అయితే ఎక్స్‌ప్రెషన్ శరీరం! ఎంత గొప్ప ఐడియా అయినా దాని చిత్రీకరణ ఎంత బాగున్నా... ఐడియాలో స్పార్క్ లేకపోతే పేలవంగా ఉండిపోతుంది. ఈ రెండింటిని సమన్వయం చేసుకుని అద్భుతమయిన కార్టూన్లు వేసిన మన బాలిగారు... కథకు బొమ్మ వేసే పద్ధతి కూడా అందరికంటే డిఫరెంట్‌గా ఉంటుంది. ఈనాటికీ ఆయన బొమ్మలు వేస్తున్న తీరు చూస్తే అందుకే బాలి ఇంత గొప్ప ఆర్టిస్ట్‌గా మన్ననలందుకుంటున్నారు అన్పిస్తుంది.

శ్రీబాలిగారికి ఈ మధ్యనే ప్రభుత్వం 'హంస' అవార్డు ఇచ్చి సత్కరించింది. ఆయన ప్రతిభకు ఇది చాలా చిన్న అవార్డు. ప్రభుత్వ ఉద్యోగం కాదని(వదిలేసి) చిత్రకళ మీద మమకారంతో ఈ రంగంలో ఎంతో కష్టపడి ఒక బొమ్మని చూడగానే ఇది బాలి బొమ్మ అనుకునే స్థాయికెళ్ళిన మన బాలిగారిని హాస్యానందం మనసారా అభినందిస్తూ.... ముమ్ముందు అద్భుతమైన చిత్రాలు ఈయన కుంచే నుంచి జాలువారాలని కోరుకుంటోంది.

**-రాము.పి**
(ఎడిటర్)

Smile in Every Page... Satisfaction in Every Smile






గత ఐదేళ్ళుగా
ప్రముఖ కార్టూనిస్ట్
**లేపాక్షి** గారిచే నడపబడుతున్న
సంపూర్ణ హాస్య వెబ్‌సైట్
www.chamatkaram.com లో

మన సంపూర్ణ
హాస్య మాస పత్రిక హాస్యానందం
'ఈ'బుక్ సంపూర్ణంగా దొరుకుతోంది.
మీరు చేయవలసినదల్లా....
**www.chamatkaram.com** క్లిక్ చేయడమే!

# నిశితపరిశీలనా శక్తిగల మేధావి శ్రీ బాలిగారు.

**-పద్మశ్రీ డా॥ఎస్.వి.రామారావు, న్యూఢిల్లీ**

**ఆం**ధ్రప్రదేశ్‌లో ఎంతోమంది ప్రసిద్ధ చిత్ర, శిల్పకారులు ఉన్నారు. అంతకంటే ఎక్కువ గానే సంఖ్యలో అద్భుతమైన కార్టూన్లను చిత్రించేవారు ఉన్నారు. తెలుగువారు ఆదరిస్తు న్నారు. ఆనందిస్తున్నారు.

చిత్రకళలో భాగమే కార్టూను కళ. అయినా దీన్ని అందరూ వేయలేరు. ఎంత గొప్ప చిత్ర కారుడైనా సరే. ఒక రకపు విశిష్టమైన భావ సంపద, మానవుని జీవన మనుగడలో అనుభవించే కష్టసుఖాలు, రాజకీయ పరిజ్ఞానం, సూటిగా, ధైర్యంగా చెప్పే ధైర్య సాహసాలు కావాలి కార్టూనిస్ట్‌కు.

ఇతర్లను ఆలోచింప చేసి... హాస్యంలో ముంచెత్తేది కార్టూను కళ.

కార్టూనులు చిత్రించడానికి... అందులో రాణించడానికి... చిత్రకళా రంగంలో ముఖ్యంగా డ్రాయింగ్‌లో కొంత కృషి పెట్టడం అవసరమవుతుంది. నిజానికి తప్పనిసరేనని అనుకోవ లసి వస్తుంది. అప్పుడు గీసే రేఖలలో జీవం ఉంటుంది. సాంఘికపరమైన కార్టూన్లను ప్రజల్ని వారి అభిమతాల్ని, నమ్మకాలను, అలవాట్లను గ్రహించడం ముఖ్యం.

ఇంతకూ నేను చెప్పదలచుకున్నది ఏమిటంటే చిత్రకారుని కంటే కార్టూనిస్టుకి నిశిత పరిశీలన చేసే అవగాహనకు కావలసిన మేధస్సు ఉండి తీరాలి అని. ఇది లేనిదే ఈ కళలో రాణించడం కష్టం.

ఎన్నో సంవత్సరాల అనుభవము, జర్నలిజంలో అవగాహన, పరిపూర్ణ రచయిత, నిశితపరిశీలనా శక్తిగల మేధావి శ్రీ బాలిగారు.

వారి చిత్రాల్లోని బలమైన రేఖలు చాలా హాయిగా, వయ్యారంగా ప్రవహిస్తున్న నదుల్లా ఉంటాయి. ముఖ్యంగా ప్రస్ఫుటంగా కన్పించేది వారు గీసిన మానవ ఆకారాల్లోని ప్రపోర్షన్. అది సాధించడానికి ఎన్నో సంవత్సరాల కృషి ఉండాలి. అందరికీ సాధ్యపడేది, వచ్చేది కాదు సులువుగా.

పత్రికల్లో ప్రచురింపబడే రచనకు క్షుణ్ణంగా చదివి ఏ సన్నివేశానికి రేఖా చిత్రం వేయాలో ఆయనకు బాగా తెలుసు. ముదోంతులుగా, ఒక్కొక్కసారి సగం పేజీగా ఆక్రమిస్తాయి వారి రేఖా చిత్రాలు.

ప్రతి మనిషి ముఖంలోని హావ భావాలు, మనుషులు కూర్చున్న తీరు, నిలబడ్డ ఠీవీ, వేసుకున్న బట్టలు గాలిలో రెపరెపలాడే సొగసు వారి రేఖా చిత్రాల్లో కనిపిస్తాయి.

శ్రీ బాలిగార్ని అమెరికా నగరంలోని చికాగో వారంతా అక్కడ జరిగే 'తానా' సభలకు ఆహ్వానించారు. వారు తనవెంట చాలా కార్టూన్లను తీసుకువచ్చారు.వాటినన్నిటినీ చిత్రకళా ప్రదర్శనలో ఉంచాం.

వాటిలో చురకలు వేసిన కార్టూన్లు, రాజకీయమైన కార్టూన్లు ఉన్నాయి. తన జీవితాన్ని కళాసాధనకు అర్పించుకున్న వ్యక్తిగా కనిపిస్తారు బాలిగారు కార్టూన్లను చూసే వారికి.

శ్రీ బాలిగారు సునిశిత మనస్కులు. నెమ్మదిగా, హుందాగా, ఎదుటి వానికి అర్థం అయ్యేట్టుగా చెప్పే తీరు ఆయనిది. ఎవరైనా మాట్లాడుతుంటుంటే శ్రద్ధగావినడం ఆయన లక్షణం.

ఆయన రేఖా చిత్రాలు నన్ను ముగ్ధుడను చేస్తాయి. వారి కార్టూన్లు నన్ను నవ్విస్తాయి-ఆలోచింపచేస్తాయి. అందర్నీ అలానే చేస్తాయని నమ్ముతాను.

నాలానే అందరికి శ్రీ బాలి గారంటే ఎనలేని ప్రేమ, గౌరవాలు ఉన్నాయని భావిస్తాను.

ఇంకా ఎన్నో సంవత్సరాలుగా, తన రచనలతో, రేఖా చిత్రాలతో, కార్టూన్లతో తెలుగు సాహితీ రంగానికి, జర్నలిజానికి సేవ చేస్తుండాలని ఆశిస్తున్నాను.






డాక్టరూ... రోగీ


ఊం. చెప్పండి! మీ బాధేమిటో...
బతకడమే బాధగా ఉంది - చచ్చిపోవాలని ఉంది. ఆఖరి ప్రయత్నంగా మీ దగ్గరికొచ్చాను


సూపర్నెంటు మీ తర్వాత ప్రమోషన్ లిస్టులో ఉన్నాడా ఏమిటి? ఆయనకెలా వుందీ అంటూ మాటిమాటికీ ఫోన్ చేస్తున్నాడు



మీరు చాలనయం! దోమలు కుట్టి ఊరినిండా .... అదేమిటమ్మో... డెంగూ రోగంతో ఛస్తున్నారు


ఏదో ఓ వేలుపట్టుకో... నీకొచ్చిన రోగమేమిటో ఇట్టే చెప్తాను


WARD 5
ఇంకా మీ ఆవిడకు ఊపిరి రాలేదు సారూ!

# "చేసే పనిలో చిత్తశుద్ధి (కొంత డొక్కశుద్ధి) ఉండాలి!"

**–బాలి**



**బాలి!... ఈ పేరు వినగానే అందమైన బొమ్మలు... నవ్వించే కార్టూన్లు... మన కళ్ళెదుట ప్రత్యక్షమైపోతాయి... కొంతమందికి ఈయన చిత్రకారులు గానే తెలుసు... మరికొంతమందికి కార్టూనిస్ట్‌గా తెలుసు... ఈయన కత్తికి రెండు వైపుల పదునే.... ఆ పదును తీవ్రత ఎలాంటిదో... ఆయన మాటల్లో ఇక్కడ తెలుసుకుందాం... మున్ముందు పేజీల్లో ఆయన బొమ్మల్ని... కార్టూన్లను ఆస్వాదిద్దాం! ముందుగా ఆయన భావాలు తెలుసుకోవడానికి కొన్ని ప్రశ్నలు హాస్యానందం విసిరితే... అంతే స్పీడ్‌గా ఆయన సమాధానాలు వదిలారు... వాటిని చదివేద్దామా!**

**✦ మీ అసలు పేరు నుండి బాలిగా రూపాంతరం చెందటం వెనుక కథేమిటో చెప్తారా?**

నాకు అంధ్రజ్యోతి వారపత్రికకు బొమ్మలు వేసే అవకాశం కల్పిస్తూ శ్రీ పురాణం గారితో పరిచయమవుతున్న కొత్తల్లో ఆయన పంపుతున్న కథలకు బొమ్మలు వేసి చివరిలో బొమ్మ క్రింద 'శంకర్' అని సంతకం చేస్తూ ముగించే వాడిని. నా పేరు శంకర్రావు కాబట్టి.

అప్పట్లో ఇలా 'శంకర్' అని సంతకం చేసే వారు ఇద్దరు ముగ్గురుండే వారు. అయితే ఆ సంతకం చేసే విధానంలో తేడాలుండవచ్చు. పురాణంగారు అది గమనించి 'బాలి' అని నామకరణం చేసారు. మొదట్లో నాకిది ఎబ్బెట్టుగా తోచింది – 'బా' అనే అక్షరం న్యూమరాలజీలో మంచిదట. సరే ఏదయితేనేం అని సరిపెటుకొని. 'బాలి' అనే బొమ్మల కింద సంతకం చేయడం మొదలు పెట్టాను. ఈ లోపు మరీ ముఖ్యమయితే తప్ప నా అసలుపేరు గుర్తుకు రావడం తగ్గిపోయింది.

**✦ చిత్రకళలో మీ ప్రస్థానం గురించి కాస్త వివరించండి?**

ఈ మధ్య పుస్తకాలు... మరీ ముఖ్యంగా యోగమూ, వాశిష్ఠమూ, ధ్యానమూ లాంటి తెలుగు పుస్తకాలూ, ప్రిన్సిపుల్ ఆఫ్ యోగా, ఓషో జిన్‌కోజోతిన్ పెయూన్ లాంటివి చదువుతోంటే ఈ లలిత కళలకు గానీ, మరి దేనికి గాని పూర్వ జన్మ ఫలం లేక దాని వాసనలు ముఖ్యమేమో అనిపిస్తున్నాయి. మా అమ్మ చక్కగా పాడేది. అందంగా ముగ్గులు వేసేది. మా నాన్నగారూ చక్కగా బొమ్మలు వేసిన వ్యక్తే. నా అయిదవ ఏట నాకు తెలియకుండానే ఆ పరిమళం నాకు అబ్బినట్టున్నది. బొమ్మలు చక్కగా వేయాలన్న సరదా పుట్టింది. రంగు పెన్సిళ్ళతో నాకు తోచిన విధంగా పువ్వుల బొమ్మలు వేసే వాడిని అవన్నీ చిన్న చిన్న గీతలలో. ఇదంతా కూనూర్ (నిలగిరి)లో జరిగింది. మా నాన్న మిలటరీలో ఉంటున్నారు. కాబట్టి మేమూ అక్కడే ఉండేవారం. ఇక ఆ తరువాత ఆ సరదా కొంచెం కొంచెం పెరిగి తీరిక దక్కినప్పుడల్లా బొమ్మలు వేయడమే సరదాగా ఉండేది.

**✦ వర్ణ వైవిధ్యానికి, రేఖావిన్యాసానికి మీరు చిరునామా అంటారు. మీ శైలి ఏమిటి?**

రేఖా చిత్రాలలో పెద్దగా రంగుల ప్రాధాన్యత ఉంటుందనుకోను. అలాగని పూర్తిగా రంగుల ప్రభావమూ విస్మరించలేం. ఎంత వరకూ రంగులు వేయాలి, రేఖలు ఎలా గీయాలి. ఆ రేఖల్లో కూడా వైవిధ్యం ఎంత వరకు చూపాలి అన్నది చిత్రకారుని పరిశీలనా శక్తి అభ్యాసము మీద అధారపడి ఉంటుంది. ఆ రేఖలన్నా, బ్రష్, క్రోక్విల్, స్టెడ్లర్ ఇలా మార్చుకుంటూ వెళ్ళాలి. ఒకేలా ఉంటే చూపరులకు ముఖం మొత్తుతుంది. నేను అన్ని శైలుల్లోనూ (రచయిత ఇచ్చిన కథాకాలం బట్టి) వేయగలను. దానికి తగ్గ రంగులూ అద్దగలను. అది ప్రాక్టీస్ మీద వచ్చిందే.

**✦ కార్టూన్‌కి, ఇలస్ట్రేషన్‌కి భేదం చాలా మంది ప్రముఖులకు తెలియదనే విమర్శకు మీరేమంటారు?**

మీరన్నట్టు 'చాలా ప్రముఖులకే' ఈ రెండింటి మధ్యా తేడా తెలియదు. కార్టూన్‌ల్లో క్యారక్టర్‌ల కొలతలూ, హావభావాలూ, దానికి మనం ఇచ్చే గీతలూ (రేఖలూ) వేరు. అదే ఇలస్ట్రేషన్‌కయితే మొత్తం మారిపోతాయి. రియాల్టీకి దగ్గరగా వెళ్ళిపోతాయి. రచనలో రచయిత ఇచ్చిన భావనకు (సెంట్రలే ఐడియా) దగ్గరగా వెళ్ళాలని ప్రయత్నిస్తాము.

**✦ మీ పై ఎవరి ప్రభావాలున్నాయి?**

నాపై ఎవరి ప్రభావమూ లేదు. అయితే కొందరి బొమ్మలు పేపర్లో చూసే వాడిని. మొదట్లో 'ఇలా వేస్తే, అలా రాస్తే' అని అనుకొనే వాడిని శైశవ దశలో. అది సహజమని ఎదుగుతున్న దశలో తెలిసింది. ఇప్పుడు కథ చదువుతుంటేనే బొమ్మ నా కళ్ళ ముందు కొచ్చేస్తుంది. అయితే ఆ రచన చదివించే గుణం, ఆలోచింపచేసే నేర్పు ఉండాలి. ఏవో కారణాల చేత ఎన్నిక కాబడి మా చేతుల్లోకొస్తాయి ఆ కథలు సగం జీవం చచ్చి.

**✦ మీ శైలి బాపుకి అనుకరణ అని కొంతమంది అంటారు... మీ సమాధానం?**

నా శైలి గురించి నాకేం తెలియదు. ఆంధ్రజ్యోతి వార పత్రికలో అడుగు పెట్టినదాక బొమ్మలు ఎలా గీయాలో, ఎంత గీస్తే పేపర్లో రిడక్షన్ అయి పేజీలో సెట్ అవుతుందో తెలియదు. అక్షరాలు అలా రకరకాలుగా రాయడమూ తెలియదు. ఎడిటర్ పురాణం గారికి రాశాను. ఏవన్నా మంచి పేపర్లు (నా దృష్టిలో పేపర్ బట్టీ బొమ్మలో స్టయిల్ మారుతుంది) కలాలూ పంపమని. కలాలు సంగతి ఆయనకు తెలియలేదు. గానీ ఏవో మంచి ఖరీదయిన పేపర్లు పంపారు.

'బొమ్మ గీసేటప్పుడు బాపు గార్ని దృష్టిలో పెట్టుకో' అన్నది ఆయనే. ఆయనెంతో సీనియర్! నిజమే.ఇక్కడో చిత్రమైన విషయం– కొత్తగా వార పత్రికలో ప్రకటించే నవలకు బొమ్మలు ఆయనతో గీయిస్తున్నామని ప్రకటనలు గుప్పించి, మొదటి వారమే ఆయన బొమ్మతో సీరియల్ ప్రచురింపబడి, మిగిలిన అన్ని వారాలూ, చివరి వరకూ నా బొమ్మలతో వచ్చేవి. 'మరి నా పేరు ప్రకటనలో చేర్చవచ్చు కదా!' అని ఒకసారి అడిగితే








**ఆంధ్రచిత్ర కళారంగంలో 'బాలి'**
**ఓ కలికితురాయి.**
**తెలుగు పత్రికా చిత్రకళ చరిత్ర అక్షరబద్ధం చేస్తే అందులో 'బాలి' శకం ఒకటుంటుంది...**
**రేఖలకు, వర్ణాలకు మధ్య అనుబంధం తెలిసిన ప్రముఖులలో 'బాలి' ఆద్యుడు అనవచ్చు!**

*–తుంబలి శివాజీ*

'నీకు పేరు మీద మహా దురదగా ఉన్నదే' అన్నది ఆయనే.

అంటే ఘోష గోవిందరాజులదీ, ముదుపు వెంకటరమణమూర్తిదీనన్న మాట! బంగారపు పళ్ళేనికయినా గోడ చేర్పు అవసరం.

**✦ తెలుగుచిత్రకళలో మీకు తగిన గుర్తింపు వచ్చిందని భావిస్తున్నారా?**

పై ప్రశ్నకు ఇది 'కంటిన్యూ' అని చెప్పుకోవాలి అంటే ఇక నేను పేరు మీద శ్రద్ధ పెట్టలేదు. నేను గవర్నమెంట్ ఉద్యోగం వదులుకొని వచ్చాను. కాబట్టి నేను విపరీతంగా శ్రమ చెయ్యాలి. అలాగయితేనే ఇక్కడ నిలబడ గలుగుతాను. చివరకు అదే చేశాను. ఇక గుర్తింపు అంటారా? అది పాఠకులే చెప్పాలి.

**✦ సహచిత్రకారులతో మీ సంబంధాలెలా ఉంటాయి?**

సహ చిత్రకారులు నాతో కాబట్టి 'సహ' జంగానే ఉంటాయి. అందువల్లనే నా కార్టూన్ పుస్తకాని నొకదాన్ని నా 'సహ' చిత్రకారులందరికీ అంకితమిచ్చాను.

**✦ మనకున్న ప్రముఖ చిత్రకారులు గానీ... కార్టూనిస్టులుగానీ ఇంచుమించు అందరూ చలనచిత్రం కోసం పని చేసారు. మీరు కూడా టీవీ కోసం గానీ సినిమా కోసం గానీ పని చేసారా?**

ఇలా ఎవరు చేశారో నేను లెక్కచేయలేదు. అది చిత్రకళాంశములోని 'టార్గెట్టు' కాదు. 'తరం మారింది' (డైరక్షన్, సింగీతం శ్రీనివాసరావు) సినిమాకు పబ్లిసిటీ చేశాను. అందులో ఓ కారెక్టర్‌కు ఆ సిన్మాలో 'బాలి' అని నాపేరు పెట్టారు. 'లింగబాబు లవ్ స్టోరీ' 'పూలపల్లకీ' సిన్మాల్లో చిన్న చిన్న వేషాలు వేశాను.

'స్త్రీ' అనే డాక్యుమెంటరీ పిక్చర్‌లో చాలా వరకూ సంఘటనలు నా బొమ్మల పైనే నడుస్తాయి.

**✦ అచ్చమైన తెలుగు చిత్రకళ రూపు రేఖలకు మీ నిర్వచనం ఏమిటి?**

ఇది గొప్ప ప్రశ్న! అయితే ఇది నిర్వచించేటంత గొప్ప వాడ్ని కాదు. మహాజలధి లాంటి 'తెలుగు చిత్ర కళ రూపురేఖలకు నా నిర్వచనం అనే సాహసం కాకిరెట్ట లాంటిది.

**✦ చిత్రకారుల సంతకాల్లో ఆ గోప్యత ఎందుకుంటుంది?**

'సంతకాల్లో గోప్యత'?... ఇది చాలా విడ్డూరంగా ఉంది. ఆ బొమ్మలను తానే వేశానంటూ చివర్న ఆ చిత్రకారుడు సంతకం పెడుతోంటే ఇక గోప్యం ఎక్కడుంది. మొత్తం తన పేరంతా పెడితే అసలు కన్నా కొసరే ఎక్కువవుతుందని జనం భయపడతారని ఏవో రెండోమూడో అక్షరాల్లో తన పేరు రాసి ఉండవచ్చు.

**✦ చిత్రకళలో పోకడలేమిటి? వాటిపై మీ అభిప్రాయమేమిటి?**

చిత్ర కళలో పోకడలంటే ఒక రకంగా కొన్నాళ్ళు వేసిన తరువాత ముఖం మొత్తితే మరోలా వేస్తూ సమర్థించుకోవడమే కొత్త పోకడ. ఇవన్నీ యూరోపియన్లు చేసే వెర్రి ప్రక్రియలు. ఇవన్నీ ఫైనార్ట్స్‌లోనే కనిపిస్తాయి. యూరప్ చిత్ర కళను చక్కగా పరిశీలించి, దానిపై విమర్శనా వ్యాసాలు వ్రాసిన ఒక పాత క్రిటిక్ రాసిందాన్ని నేను చదవడం జరిగింది. ఇది చదివి ఐదారు సంవత్స రాలు జరిగి ఉంటుంది. వారి చిత్రకళంతా (ఫ్రాన్స్, స్పెయిన్, జర్మన్, బ్రిటన్, హంగేరీ) ప్రపంచ యుద్ధాల మధ్యలో జరిగిన కాలంలోనూ, సోషలిస్టు, కమ్యూనిష్టు భావ జాలంలోనూ విశృంఖలంగా తిరిగి వంటికి అంటించుకున్న సుఖరోగాల మధ్య కలిగే నొప్పుల మయమై పోయి ఉంటుందట. మధ్య, మధ్య కలిగే మూలుగుల్లో నెమ్మదిగా



ఏమంటారంటే "ప్రపంచ బాధే నా భాధ" అని.

✦ **చిత్రకారులు వేరే ప్రపంచంలో ఉంటారా?**

లేదు. ఇక్కడే ఉంటారు. వెధవ బాధల్తో అలా అని పింప చేస్తారు.

✦ **మీ చిత్రాలు జాతిని జాగృతం చేసిన సందర్భాలేమిటి?**

నా బొమ్మలు – 'జాతిని జాగృతం చెయ్యటం' ఇదేదో గొప్ప మాట. నన్నే జాగృతం చెయ్యడం లేదు. ప్రపంచం దాకా ఎందుకు? బొమ్మలు వేయించుకున్నవారు నా డబ్బులు నా చేతిలో పెడితే చాలు.

✦ **చిత్రకళపై ఇప్పటి సాంకేతికత ప్రభావం మంచిదేనా?**

మంచిదే. మార్పు ఎప్పుడూ మంచిదే! అది సహజం కూడా.

✦ **మోడల్‌ని తీసుకొని వేసే చిత్రాలు అన్ని విషయాల్లో సరైనవేనా?**

'మోడల్‌ని' తీసుకొని ఇప్పుడెవరు వేస్తున్నారు. ఏదో ఎనాటమీ డ్రాయింగ్ సెక్షన్‌లో (పీరియడ్‌లో) తప్ప. అలా తీసుకున్న వారు ఇరవై శతాబ్దంలో మొదట్లోనే 'రాజా రవివర్మ'తో ఆగిపోయారు.

✦ **వచ్చే తరానికి మీరిచ్చే సందేశమేమిటి?**

సందేశాలిచ్చేంత గొప్పవాడ్ని కాదు గానీ చేసే పని చేసే పనిలో చిత్తశుద్ధి ఉంటే చాలు (కొంత డొక్కశుద్ధి)

✦ **హాస్యానందం గురించి మీ అభిప్రాయం?**

నా అభిప్రాయం సదభిప్రాయమే!! ప్రకటనలకు ఎగబడకుండా నలుగురినీ మంచి చేసుకుని ఓ మంచి కార్టూన్ పత్రికను నడుపుతున్న చి॥రాముకి మనసా అభివందనలు.

**ఇంటర్వ్యూ: తుంబలి శివాజీ**



The art of Bali







The art of Bali


The art of Bali


The art of Bali


The art of Bali

# మంచి మనిషి బాలి



**బా**లిగార్ని మొట్టమొదటిసారిగా ఆంధ్ర జ్యోతి ఆఫీసులో కలిశాను. ఐతే వారి సీటు ముందు కూర్చున్న రెండు మూడు నిమిషాలకే ఎడిటరు గారి నుండి పిలుపొచ్చింది.

ఎడిటర్ గదిలోకి వెళ్ళిపోయాను. తరువాత కొన్నేళ్ళు గడిచాక, బాలిగారిని బందరురోడ్లో వాళ్ళింట్లో కలిశాను. సాదరంగా ఆహ్వానించి నాతో కబుర్లాడి పంపించారు. అంత పెద్ద ఆర్టిస్టయిన ఎంతో నిగర్వంగా ఒక చాపమీద కూర్చుని బొమ్మలు గీసుకుంటూ జీవనం సాగించే బాలిని కలవడం నా అదృష్టంగా భావించాను.

2000వ సంవత్సరం హైదరాబాదు, లుంబిని పార్కులో తెలుగు కార్టూనిస్టుల ఎగ్జిబిషన్‌లో నాకు బాలిగారు కనిపించారు.

'బాలీ' అని అరిచి, ఆయనవైపు నడిచి, కర చాలనం చేసి పలకరించాను. ఆ మాట, ఈ మాట మాట్లాడుతూ తనకేదైనా ఉద్యోగం చూసి పెట్టరా అని అడిగారు.


బాలి గారంతటి వ్యక్తి ఉద్యోగం కావాలంటే, ఇవ్వనివారెవరుంటారు. వారినెలా కాంటాక్టు చేయాలో, వివరాలు తెల్సుకుని, నా ఆఫీసుకు చేరుకున్నాను. అప్పట్లో నేను కలర్ చిప్స్ ఇండియా లిమిటెడ్‌లో, క్రియేటివ్ డైరక్టరు జాబ్ చేస్తున్నాను.

మరుసటిరోజు కలర్‌చిప్స్ సిండికేట్‌విభాగం చీఫ్‌గా చేస్తున్న కుంజేష్ పరిహార్ గారికి బాలి గురించి చెప్పాను. అదృష్టం కొద్దీ, కంపెనీలో, సిండికేట్ విభాగానికి చీఫ్‌ఆర్టిస్ట్ అవసరం కావల్సి ఉంది.

బాలిగారి వివరాలని, ఆయన టేబుల్ మీద పెట్టి, నా క్యాబిన్‌కు వెళ్ళిపోయాను. ఆ తర్వాత రెండ్రోజులకే అమెరికా వెళ్ళిపోయాను. పది హేను రోజులు తరువాత, నాకు అమెరికాలో, కలర్‌చిప్స్ నుండి ఫోను వచ్చింది. బాలి గారిని ఛీఫ్ ఆర్టిస్టుగా తీసుకున్నారని తెలిసి చాలా ఆనందించాను.

ఏ కథకైనా, ఏ కవితకైనా, ఏ జోకుకైనా, నిమిషాల్లో ఆయన కుంచె, క్రోక్విల్‌పాళీలు, బొమ్మలు సరసరా గీసి ర్యాకులు నింపేవి. కలర్ చిప్స్‌లో ఆయన మైనంపాటి భాస్కర్ గారు, పుక్కళ్ళ రామకృష్ణ కలిసి ఒక గ్రూపుగా పని చేసేవారు. నేను అప్పుడప్పుడు మెట్టుదిగి బాలిగారి క్యాబిన్‌లో పది, పదిహేను నిమిషాలు గడిపి, సేద తీర్చుకునేవాడిని. అలాంటి సమయాల్లో బాలిగారి గురించి కొన్ని విషయాలని గ్రహించే అవకాశాలు నాకు లభించాయి.

బాలి నిండైన మనిషి. తొణకని కుండ. తన సంతోషాన్ని తన దుఃఖాన్ని తనలోనే వుంచుకుని, విధిని సక్రమంగా నిర్వహించే, కార్య దక్షత కలిగిన ఉద్యోగి. అందుకే బాలిని అందరూ అభిమానించేవాళ్ళు.




బాలిగారు శలవులో ఉన్నారని హెచ్. ఆర్ చెప్పారు. ఊరెళ్ళారేమో అనుకున్నాను. ఒక రోజు ఆయన సీట్లో కనిపించారు. బాలిగారూ, ఎప్పుడొచ్చారు అని పలకరించబోయాను. లేచి నుంచుని నన్ను దగ్గరికి లాక్కుని తన సతీమణి కాలధర్మం చెందిన సంగతి చెప్పారు. ఆయన్ని గట్టిగా వాటేసుకున్నాను.

నిమిషం పాటు నా మది చలించిపోయింది. అయనే నన్ను తేరుకొనేలా చేశారు... ఒక చిరునవ్వు నవ్వి. నన్ను, నా క్యాబిన్‌కు సాగ నంపారు. అంత మెత్తటి మనిషికి ఎంత గట్టి గుండె. అలాంటి వ్యక్తులు ఈ రోజుల్లో మనకి చాలా అరుదుగా కనిపిస్తారు.


కలర్ చిప్స్‌లో, 2003 చివరిదాకా, బాలి గారితో కలిసి పనిచేసే భాగ్యం నాకు దక్కింది. కలర్‌చిప్స్ రూపొందించిన "హనుమాన్ చాలీసా" శిల్పి ఆయనే.

ఎన్నో అపూర్వమైన బొమ్మలు కథలు, ఫీచర్లు, కార్టూన్ స్ట్రిపులు బాలిగారు కలర్‌చిప్స్ కొసరం సృష్టించారు.

ఆయన నేనూ కలిసి Menopause సబ్జెక్టు మీద 60 కార్టూన్లు, కేవలం ఒక వారం రోజుల్లోనే గీశాము. Reddy Labs వాళ్ళకోసం గీసిన ఆ కార్టూన్లు, నభూతో నభవిష్యతి! మా అనుభవం అంతా, వాటిల్లో కుదించాం! ఎప్పటికీ మరువలేని అపూర్వమైన అనుభూతి బాలి గారి సాంగత్యం ద్వారా నాకు లభించింది. పెద్ద పేరూ వచ్చింది!

బాలి గొప్ప వ్యక్తి. మనసులో వున్నది చెబుతాడు. ఏదీ దాచుకోడు. అంత మంచి మనిషికి ఈ ప్రత్యేక సంచిక అభినందన పుష్పగుచ్ఛం, అందిస్తున్నందుకు, చాలా సంతోషిస్తున్నాను.


బాలిగారు చల్లగా ఉండాలని, తెలుగు పాఠక లోకానికి, దీర్ఘకాల సేవలందించాలని ఆకాంక్షిస్తున్నాను. **-కార్టూనిస్టు జయదేవ్**


ఈ పెయింటింగ్
మా బాబాయిగారు వేసిందే!
ఆయనెప్పుడూ మా అమ్మ
ముఖం చూసి


ఇంట్లో బియ్యంలేవు..బియ్యంలేవు అని
అఘోరించే బదులు
ఆ ఖాళీ సీసాలన్నీ అమ్మి, బియ్యం
కొనకూడదటే


పాయసంలో ఉందా! తలదువ్వుకుందామని
ఇల్లంతా
వెతికాను
సుమండీ!


మా వారు చైన్ స్మోకర్ అని చెప్పాను కదే!


నా కళ్ళు చూడండి సార్!
ఏవేవో భావాలు పలకడం లేదూ...


ఇది అమ్మాయి గది
బాబూ! అద్దంలా
ఉంచుకుంటుంది

# ఈ లోకం ఇంతేనయా...!

గీత,రాత: Bali




అయ్యలారా! అమ్మలారా!! ఇన్నాళ్లకు నాకు జ్ఞానోదయం అయ్యింది. అదిగదిగో ఆ పార్టీయే గొప్పదని తెలిసింది. ఇక అందులో ఒకడ్ని అయిపోవాలని నాలో గుల రెకెత్తింది-పాత పార్టీఓళ్ళు సెడ్డోళ్లని-ఇంతింత మీసాలున్నా గుర్తించలేదని ఇందాకే తెలిసొచ్చింది.

అందుకే ఇటుగెంతెస్తున్నాను.

వేయరూ నా మెడలో మీ పార్టీ కలర్ కండువ! ఇవ్వరూ మీ పార్టీ తీర్థం కడుపునిండుగా... ఇక ప్రజలకు చేసుకుంటాను సేవ... ఆ చేత్తో నాలుగు రాళ్ళు వెనకేసుకుంటాను. ఇక అందరి మెప్పూ పొందుతాను.



అయ్యలారా! అమాయక ప్రెజలారా!!

నేను పోలీసోడ్ని. అంటే మీ రక్షకుడ్ని. కావాలంటే మా వ్యాన్ మీద చూసుకోండి 'ప్రజారక్షణ శాఖ' అని రాసి ఉంటుంది.

దొంగలూ-దొంగ సన్నాసోళ్లూ మా చిన్న-చిన్న తమ్ముళ్ళే... అని ఆడిపోసు కుంటారు కిట్టనివాళ్ళు.

ఆళ్ళ జిమ్మడ!

చీకటి పడితే చాలు... వ్యవహారం మీద వారూ... డ్యూటీ పని మీద మేమూ చీకటిలో కలుసుకుంటాం.ఆ మాత్రం స్నేహం తప్పా చెప్పండి?



ఏం చెప్పను-చెప్పండి!

నా వెండి తెర జీవితం చెప్పాలంటే...

ఆ రోజుల్లో నా చెంగు తగిలితే చాలన్న వాడుండేవాడు.

ఓ పది పదిహేన్నేళ్ళు నా వగలే వగలు... నా అందలే అందాలు...

ఇప్పుడు అద్దంలో చూసుకుంటే జారిపోయిన నా బుగ్గలు నుంచి... అన్నీ జారిపోయాయనిపిస్తుంది.

నా వెంటపడ్డ కుర్రకారులు ఇప్పుడు ఎక్కడున్నారో పాపం!

'ఎంత ముసలి దానివయ్యావే' అని నా సహనటిని పలకరిస్తూ అడిగేను మొన్న.

'ఆహాc! నువ్వు పడుచుగా ఉన్నట్టు' అంది.

నా మనస్సు కలుక్కుమంది.

నా మేకప్ నన్ను రక్షించ లేదన్నమాట!



ఓ ప్రేమికురాలా!

'లవ్' అంటే మూడు గంటల సినిమాలు కాదే వెర్రిదానా! నీ ప్రేమికుడూ-నువ్వూ పైన పోయే పిట్టలు చూస్తూ, గాలిలో ఊగే పువ్వులను చూస్తూ... బఠాణీలు, పిడత కిందపప్పూ తినటం కాదే అమ్మడు! చీకటిలో శరీర భాగాలు తడుము కుంటూ స్పర్శలోని వెచ్చదనంతో, భారంగా నిట్టూర్చుతూ నువ్వే అతడై-అతడే నీవై నాలుగు కళ్ళూ ఒకటి కావడం కాదే పాప!

ప్రేమ వెంట పెళ్ళి ఉంటుంది-పెళ్ళి వెనుక సంఘం ఉంది. ఆ సంఘం నిన్ను ఆనందంగా ఆహ్వానిస్తోందో లేదో గ్రహించు. పిరికి ప్రేమికుడు కాదనీ ప్రమాణించుకో- ఏ మరిచావా... కట్నపు కోరలూ-ఎత్తయిన కడపూ, లోతయిన దుఃఖం, ఎండ్రిన్ డబ్బా... అన్నీ నీకే... నీకే.... నీకే....!



విద్యను బోధించే గురువర్యులారా!

మహా మహా మంత్రివర్యులారా!!

మా నడుములు విరగ్గొట్టే... ఈ పుస్తకాల బరువులేమిటయ్యా? గైడ్సూ, టెక్స్టులూ, స్పెషల్ నోట్సులు, మెయిన్ నోట్సులు- ఇంకా... ఇంకా... ఇంకా...!

మీకు మా వయస్సున్న మనవళ్ళు మనవరాళ్ళు లేరూ...

ఇది హింస అనిపించడం లేదూ...!

ఈ లేత వయస్సులో గంపెడు బరువులతో చెమటలు కక్కు కుంటూ... మేం పోతుంటే డాక్టర్లు నెత్తి మొత్తుకోవడం లేదూ...

అది మంచిది కాదని...

మందమైన మీ తోలుకీ-

మొద్దుబారిన మీ మెదళ్ళకీ ఎప్పుడురా స్పర్శ కలిగేది?




పాపం! సుబ్బిగాడ్ని చూస్తే జాలేస్తుంది.

వీడో కథారచయిత- తన కథలు పంపని పత్రిక లేదు. అవి పడిన దాఖలాలు లేవు. వాంతులే నయం, కాస్త ఆలస్యంగా వస్తాయి. పాపం వీడి కథలు తిరుగుటపాలో వెనక్కి తిరిగేలోగా చేతిలో పడతాయి.

ఏవో వాదాలున్నాయని విన్నాడు. వాటిని ఇంప్లిమెంట్ చేద్దామనుకున్నాడు. మొదట స్త్రీ వాదంతో మొదలు పెట్టాడు. లాభం లేకపోయింది. దళిత వాదం అందుకున్నాడు.

అదీ అంతే!

చివరకు పిడివాదంలోకి దిగాడు వరసగా నాలుగు పత్రికల్లో కథలు వచ్చాయి.

సుబ్బుగాడికీ డబ్బులు వచ్చాయి ప్రతిఫలంగా.

**అభినందనలు.**



**హా**స్యానందం బాలిగారి ప్రత్యేక సంచిక రూపొందిస్తున్నందుకు బాలిగారికి, హాస్యానందానికి నా అభినందనలు.

**-బి.వి.సత్యమూర్తి, కార్టూనిస్ట్**

## బాలి గారి గుభాళింపు... తాళింపు...

**-హరి**



**మా** ఇసాకపట్నం పెందుర్తి పెంకుల గ్రంధాలయంలో పుస్తకాలు చదువుతుండగా... పక్కనే వున్న ఇంట్లోంచో... షాపులోంచో ఎస్పీబాలు, పి.సుశీల గానం ఆల్ఇండియా రేడియోలో కమ్మగా వినిపించేది. అదలా వింటూ, ఈ పుస్తకాలలా చదువుతుంటుండగా నలుపు తెలుపులు, రంగులకలల్లో 'బాలి' గారి బొమ్మల గుభాళింపు తెగ ఆస్వాదించాను. దేవుడు (ఉంటే...గింటే) ప్రసాదించిన ఇంత అందమైన అద్భుతమైన జీవితంలో ఒకానొక ప్రశాంత వాతావరణంలో ఆయన బొమ్మల్ని ఆసాంతం ఆస్వాదించాను.

ఆయనలా బొమ్మలు గీయాలని నేనెప్పుడూ అనుకోలేదు. నాలాగే నాకు వచ్చినట్లు, నచ్చినట్లు గీయాలనుకున్నాను.

హైదరాబాద్ హిపోక్రాటిక్ జీవితంలో (ఏంటి విశాఖపట్నంలో హిపోక్రాటిక్స్ లేరా? ఏంటి?) గాలి మాటల విచిత్ర కబుర్లలో ఏది నిజమో, ఏది అబద్దమో తెలియని అయోమయంలో... వృత్తిని...స్వశక్తిని...నడచివచ్చిన దారిని... రూట్స్‌ని మరచిపోని సరదాయైన చిత్రకారుడు, కార్టూనిస్టు అయిన బాలి గారిని కలుసుకున్నాక..నా మార్గం నాకు క్లియర్ అయింది.

పనిచేయడం...ఎప్పటిపనిని అప్పుడే క్లియర్‌చేయడం... శుభ్రంగా వుండటం మనం ఆయన నుంచి నేర్చుకోదగ్గ మంచి విషయాలుగా నాకు అనిపించాయి.

ఆయన మాట్లాడుతుంటే కథ చెపుతున్నట్లుగా ఉండి మన కళ్ల ముందర దృశ్యాలు కదులుతుంటాయి. ఒక పక్క మనం ఆయన మాటల గు'బాలి'ంపును ఆస్వాదిస్తుంటే... ఎందరెందరో మహానుబావులకు తాటాకులు కట్టి...తాళింపు పెట్టేస్తారు. (విశాఖపట్నం భాషలో గాలితీసేస్తారు).

బాలి గారి కార్టూన్లలో నాకు నచ్చిన కార్టూన్లు 'కులవ్యవస్థపై' వేసిన కార్టూన్లు కొన్ని. ఇంకా సినిమాలపై ఆయన సెటైర్లు నవ్వుతెప్పిస్తాయి. ఈ మధ్య ఆయన రాస్తున్న కథలు కూడా చదువుతున్నాను. అవి కూడా చాలా బాగున్నాయి. కార్టూనిస్ట్ శేఖర్‌గారు నేను ఓసారి సీతాఫల్‌మండిలో వున్న వారింటికి వెళ్లినపుడు ఆయన స్వయంగా చేసి ఇచ్చిన 'సున్నివుండలు' లాగ!



The art of Bali

## బాలిగారికృషికి నమస్కారాలు!




**బా**లి బొమ్మలు చూస్తే ఆయనకు లొంగని 'పాళీ' ఉంటుం దా అన్పిస్తుంది. రకరకాల రేఖా విన్యాసాలతో చూపు తిప్పు కోకుండా చేస్తాయి. ఆయన చేతి రాత (గీత) అంత అందంగా ఉంటుంది మరి!

నేనెప్పుడో ఆంధ్రప్రభ చిన్నారి పుస్తకంలో బాలిగారి 'చందు' కి అభిమానిని, అలా బాలి బొమ్మల్ని చూస్తూ రోజు రోజుకి అభిమానం పెరిగిందే కానీ తరగలేదు.

ఒక కూర్చున్న బొమ్మ, ఒక నిల్చున్న బొమ్మలతో కార్టూన్లు వేస్తూ నేనూ కార్టూనిస్ట్‌నే అనుకుంటున్న సందర్భంలో 'బాలి కార్టూన్ల పుస్తకం' నా కంట పడి చెంప ఛెళ్ళుమనిపించి... కాలర్ పట్టుకుని గీతలంటే ఇలా ఉండాలి... ఫోజులంటే అలా ఉండాలి... సందర్భానుసారంగా భావ ప్రకటన ఇలా చేయాలి– అని ఓనమాలు నేర్పింది. ఆయన చిత్రాల వెనుక ఎన్నో ఏళ్ళ కఠోర శ్రమ ఉంది. అయినా ఇంకా ఆయనకు బొమ్మలపై దాహం తీరలేదు. నిత్య విద్యార్థిలా వినూత్న శైలిలో బొమ్మల్ని ఎప్పటికప్పుడు మనకు అందిస్తూ... ఆయన బలమైన గీతలతో కట్టి పడేస్తూనే ఉన్నారు.


బాలిబొమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని బొమ్మలు వేస్తున్న ఎంతోమందిలో నేనూ ఒకడిగా బాలిగారి కృషికి చేతులెత్తి నమస్కారాలు చెబుతూ.... **-నందు**


అత్తాకోడలీయం


మేం సుబ్బరంగా గదిలో పడుకున్నమన్న
మాటేగాని అక్కడయ్ మా అత్తగారు బయట
హమ్మాంలో పడుకోని తెల్లార్లూ దగ్గుతుంది.
ముసలిదాన్ని ఆరుబయట బయటుంచేమన్న
అపవ పోగానిలోన
మాకేం నిద్రపడుతుంది
చెప్పు


మీ మామగారు లెక్కలమాష్టారు. రొట్టె గుండ్రంగా
వృత్తలేఖినితో గీసినట్టుండాలి. నువ్వు ఇండియా మ్యాప్‌లు
చేస్తున్నావు. ఆయన
హిష్టరీ మేష్టారు కాదుగా—


మా కోడలు చాలా అదృష్ట
వంతురాలే వదినా—
పెళ్ళయి ఇలా కాపరానికి వచ్చిందో
లేదో వాళ్ళత్తగారు
గుటుక్కుమంది—


మీ అబ్బాయి
కోడలూ చిలకా
గోరింకల్లా
ఉన్నారే!
ఉండకేం చేస్తారు — ఇక
ఈ కొంపలో నేనో కాకిని.
ఏకాకిని.


చూసారా! మీ అమ్మ ఎంత గడుసుదో—
మెత్తగా ఉంటే.... త్వరగా
తినేస్తామనే ఈ సున్నుండలు.....
పళ్ళు చితకకుండా
చేసిందోయ్—



The art of Bali


The art of Bali


The art of Bali



The art of Bali


…నీకెన్నోసార్లు చెప్పాను-
పోపుడబ్బాలో
బల్లులు దూరొచ్చని…
ఇప్పుడవి
పులుసులో
ఉన్నాయి చూసుకో


తెల్లారి
అలారం వాచీ
చెడిపోయింది మరి!


కొత్తచీరనీ అలా అంతపైకి
లాక్కుంటారేటే!


….నన్ను డిస్టర్బ్ చెయ్యకు.
ఈ సంసారం ఎలా గడుస్తుందా..
అని ఆలోచిస్తున్నాను



ఏవిటే పాపారావ్!
ఇంకా బ్రష్ కొనలేదా!


అంతంత పుస్తకాలు రాసి- గెడ్డాలు పెంచుకొని
వాటివేపు చూస్తూ కూచుంటే ఏం లాభం!
ఎవర్ని పట్టుకుంటే పనులవుతాయో
చూడండి. జ్ఞానపీఠ్
అవార్డో… సాహితీసేవా
బహుమతో రాకపోదు


వయసు మళ్ళిన
ప్రేమకథ


....మన పెళ్ళికేం తొందర మోహన్!
నాకు అన్నివిధాలా నచ్చినవాడు
రాడని గ్యారంటీ
ఏమిటి!


అదేమిటో మోహన్! నీకోసం ఎదురు
చూస్తుంటే నిమిషాలు గంటల్లా ఉంటాయి!
నువ్వొచ్చాక గంటలు నిమిషాలవుతాయి
Bali
అదే ప్రేమంటే... ఇపుడు పెళ్ళి చేసుకున్నామే
అనుకో_ రోజులు యుగాలుగా
మారిపోతాయి


నీకు తెలుసు కదా! నేనెంత
ఖచ్చితమైన మనిషినో, ప్రేమలోనూ అంతే!
సరిగ్గా ఆరుగంటలకు బీచ్‌కి రావల్సిన
సుబ్బుల ఏడుగంటలకొచ్చింది.
వెంటనే గుడ్‌బై చెప్పేశాను
Bali


......అమ్మ నన్ను రాజూ అని పిలుస్తుంది. మా ఫ్రెండ్
సుందర్ అంటాడు. కాలేజీలో వాళ్ళంతా వీర్రాజు
అంటారు. నాన్న రమణమూర్తి అంటాడు. బంధువులు
సుబ్బి అంటారు. ఇక నీకు
ఇష్టమైన పేరుతో పిలుచుకో
Bali


నీకూ నా పేరు అంటే ఇష్టమేనన్నమాట!
సుధాకర్ కి అంతే....
సుబ్బారావు మాత్రం నా పేరే కట్టు
బావుంటుందంటాడు.

# నాకు తెలిసిన బాలి గారు...

## -పుక్కల్ల రామకృష్ణ, కార్టూనిస్ట్

**బా**లి గారితో నాది పదకొండేళ్ళ అనుబంధం.


యానిమేషన్‌పట్ల నాకున్న శ్రద్ధాసక్తులు గమనించి జయదేవ్‌బాబుగారు, 'కలర్ చిప్స్' అనే యానిమేషన్ స్టుడియోలో నాకు శిక్షణ ఇప్పించడమే కాకుండా శిక్షణ అనంతరం అదే స్టుడియోలో ఉద్యోగవకాశం కూడా కల్పించారు.


బాలిగారు ఆ స్టుడియోలో సిండికేషన్ డిపార్ట్‌మెంట్లో చీఫ్ ఆర్టిస్ట్‌గా వుండేవారు. సిండికేట్ విభాగంలో ఆర్టిస్టుల కొరత వుండడం వలన కొంతకాలం సిండికేషన్ విభాగంలో బాలి గారికి శిష్యరికం చేసే మహాదావకాశం కలిగింది.


సిండికేషన్ విభాగంలోబాలిగారు ఫీచర్స్‌కి బొమ్మలు గీయడమే కాకుండా అప్పుడప్పుడు యానిమేషన్‌కు సంబంధించిన క్యారెక్టర్ డిజైన్స్ కూడా చేసేవారు. నాకు తీరిక సమయం దొరికితే అతను బొమ్మలకు రఫ్ స్కెచ్‌లు పెన్సిల్‌తో గీస్తుంటే, శ్రద్ధగా కళ్ళప్పగించి చూసేవాణ్ని. పెన్సిల్‌తో గీసిన గజిబిజి గీతలు ఇంకింగ్ చేస్తున్నప్పుడు అందమైన బొమ్మలుగా మారటం నాకు బలే అద్భుతంగా తోచేది. అవి చూసి నేను బొమ్మల గీసే పాత పద్ధతులకు తిలోదకాలిచ్చి, బాలిగారి పద్ధతిలో సాధన చేయడానికి అప్పటినుండి అలవాటు పడ్డాను. బాలి గారి పద్ధతిలో నేను గీసిన బొమ్మల ప్రమాణాలు మెరుగు పడటమే కాకుండా గ్రాఫిక్ డిజైనర్‌గా నాకు ఆ పద్ధతి ఎంతో ఉపయోగపడింది.




రిఫరెన్స్ గా వుంటాయని, అతను స్క్రిబుల్ చేసిన పెన్సిల్ గీతల్ని జెరాక్స్ చేసి కాపీలను వుంచుకునేవాణ్ని. పెన్సిల్ గీతల్ని బ్రష్ (బాలిగారు బ్రష్ ఎక్కువగా వాడేవారు) తో ఇంకింగ్ చేసి ఆరాక, పెన్సిల్ గీతల్ని తుడిపేసిన బొమ్మల్ని కూడా జెరాక్స్ చేసి వాటిని ఇంకింగ్‌కి పూర్వం పెన్సిల్ గీతల జెరాక్స్ కాపీతో పోల్చి చూసుకుంటే బొమ్మలు గీయడంలో మెళకువలు అర్థమయ్యేవి. పదిలంగా దాచిన అప్పటి చిత్రాలలో ఒక చిత్రాన్ని, హాస్యానందం బాలి ప్రత్యేక సంచికలో ఇలా పంచుకోవడం సంతోషంగా వుంది.











బాలిగారిలో ముక్కు సూటిగా పోయే మనస్తత్వం అతనిలో నాకు నచ్చే అంశాలలో ఒకటి. ఔత్సాహిక కార్టూనిస్టుల కార్టూన్లపై "ఇలా చేస్తే బాగోదు, అలా అయితే బాగుంటుంది" అని నిక్కచ్చిగా తన అభిప్రాయం చెప్పడమే కాకుండా విసుక్కో కుండా చక్కటి గీతలు గీయడానికి అవసరమయ్యే సరంజామా కోసం ఓపికగా వివరించడంలో బాలి గారి పెద్ద మనసు ప్రస్ఫుట మవుతుంది. చేసే పని పట్ల అంకిత భావం ఉంటేనే అద్భుతాలు సృష్టించవచ్చని బాలి గారి పని తీరు పరిశీలిస్తే అర్థ మవుతుంది. బొమ్మలు గీయడం ఎంతో ఉన్నతి సాధించినా, బాలిగారు ఇప్పటికీ వైవిధ్యం కనబరచే చిత్రకారుల గీతాల్ని ఆరాధించడమే కాకుండా వాటిని హృదయంలో పదిల పరచుకుంటారు.

ఈ నెల హాస్యానందం బాలిగారి స్పెషల్‌గా మన ముందుకు వచ్చినందుకు బాలి గారికి అభినందనలు, సంపాదక వర్గానికి ధన్యవాదములు.


సీరియల్ 98716752
PART
టీవీలో సీరియల్


ఏమిటీ! టీ.వీ బాగుచేయడానికి ఇంకా వారం రోజులు కావాలా? ఈలోపున ఎలాగోలా సర్దుకోవాలా?


ఆ ఏడుపును మీకు చూడ్డం ఇష్టం లేకపోతే టీ.వీని కట్టెయ్యొచ్చు కదండీ!


'దిక్కుమాలిన రాగాలు' అనే టీ.విలో మొదలెట్టిన రోజే వీడు పుట్టాడు...


ఇది కొత్తగా కనిపెట్టిన మొబైల్ 'టి.వి' సార్. అన్ని సీరియల్స్ చూడాలంటే మెడకు కట్టుకొని కొంపలంట తిరగొచ్చు....


భక్తి పాటలొస్తుంటాయి — మీకు తోస్తుంది అని అబ్బాయితో పోరి కేబుల్ కనెక్షన్ పెట్టించాను—
FASHION

## ఇలస్ట్రేషన్‌కీ... కార్టూన్‌కీ తేడా తెలిసిన వ్యక్తి



తెలుగు కార్టూనిస్టుల సంఖ్య ఎక్కువే! అయితే గుర్తుండిపోయే కార్టూన్లు గీసేవారి సంఖ్య తక్కువ! 'మీ కిష్టమైన కొంతమంది కార్టూనిస్టుల పేర్లు చెప్పండ'ని ఎవరిని అడిగినా... అందులో బాలిగారి పేరు తప్పకుండా ఉంటుంది.

చిత్రకారునిగా మంచిపేరు సంపాదించినా కార్టూన్లు గీయడం మానలేదు.

నా చిన్నతనం నుండి బాలి బొమ్మలను... కార్టూన్లను నిశితంగా పరిశీలిస్తున్నాను. అనేక వేల పుస్తకాలకు ముఖ చిత్రాలను అందించారు. అన్ని పత్రికల్లోనూ వీరి కార్టూన్లు వచ్చాయి. వేలాది కథలకు బొమ్మలు చిత్రించారు.

ఎప్పటికప్పుడు బొమ్మల్లో వైవిధ్యం చూపిస్తూ ఆహాఁ! అనుకునేలా వర్క్ చేస్తున్నారు.

చిన్న పెద్ద అనే తేడా లేకుండా అందరితో స్నేహం చేసే తత్త్వం వీరిది.


మ అభిప్రాయాన్ని నిర్మొహమాటంగా చెప్తుంటారు. వీరి కార్టూన్లు వాస్తవానికి చాలా దగ్గరగా ఉంటాయి. సంస్కృతిని ప్రతిబింబిస్తుంటాయి.

తక్కువ గీతల్లో ఎక్కువ భావాలను పలకరించగలరు. వీరి కార్టూన్లు 'హిమాలయ టైమ్స్', 'దినమలార్', 'కదిరవన్', 'ఎం.ఎం.కామిక్స్', 'అజిత్ జలంధర్' వంటి పలు భాషా పత్రికల్లో కూడా ప్రచురింపబడ్డాయి.

బాలిగారి కుంచె నుంచి మరెన్నో మంచి కార్టూన్లు రావాలని కోరుకుంటున్నాను. **–డా॥ రావెళ్ళ శ్రీనివాసరావు**




### బాలి–కార్టూన్ కింగే అయినా...'భువన్'కి ఫ్రెండే!



**మే**డిశెట్టి శంకర్రావూ... మేడిన్ అనకాపల్లి! ఈ అనకాపల్లి అబ్బాయికి, ఆంధ్రజ్యోతి పురాణం సుబ్రహ్మణ్య శర్మగారు 'బాలి' అనే ముద్దు పేరు పెట్టారు. కళాప్రపూర్ణ లతగారు చెప్పినట్లు 'ఈయన తలిశెట్టి రామారావు వారసుడే కాదు... రవివర్మ మరుజన్మ కూడా!'

ఎడిటర్స్ ఛాయిస్‌గా ముందుండే శ్రీ బాలిగారు మా ఊరి వారవటం... మా కందరికీ ఎంతో గర్వకారణం. ఆయన అబ్బాయిలు అమెరికాలో ఉన్ననూ... తెలుగుతనం మీదనున్న కళాభిమానంతో బాలిగారు ఆంధ్రను వదల్లేదు...అనకాపల్లి అడప దడపా రాకుండానూ ఉండలేదు!

లెక్కలేనన్ని వ్యంగ్య చిత్రాలు, లెక్కకు మించిన ముఖచిత్రాలు వేసారు శ్రీబాలిగారు.


హాస్యానందంలో నా 'నవ్వులాట' శీర్షిక కథలకి పుస్తకం వేయిస్తే దానికి బాలిగారు ముఖచిత్రం వేస్తే... సంవత్సరం తిరక్కుండానే కాపీలన్నీ అమ్ముడయి పోయాయి... దటీజ్ బాలి!


అరవై దాటిన బాలి– ఎప్పటికీ ఇరవై ఏళ్ళన్నట్లుగానే ఉండాలనీ... ఏనాటికైనా ఇలానే మెరుస్తూనే ఉండాలనీ... మరో వందేళ్ళపాటు ఆయన కార్టూన్లు... ఇలస్ట్రేషన్లు ప్రపంచం గర్వించేలా వేస్తూనే ఉండాలనీ...


ఒకే ఊరి వాడిగా... ఓ కార్టూనిస్ట్‌గా 'బాలి'కి అత్యంత ఇష్టునిగా మనసారా కోరుకుంటున్నాను. **–భువన్**


నీడల్లో నిజాలు


సెక్యూరిటీయా!
నా బొంద! ఏ వెధవ పనీ హాయిగా చెయ్యలేక పోతున్నాను దేవుడా!


గేదెలా తింటున్నావురా గాడిద కొడకా! తిను తిను మరి రెండు వడ్డించనా...


ఏమేవ్ ఎక్కడా!
ఇక్కడేరా మగడా! కొత్త కళ్ళజోడా ఏమిటో... పైకి చూస్తున్నావ్


ఈ దేశం మనకేమిచ్చింది.. అని గాక మనం ఏం ఇవ్వాలని ఆలోచించాలా? మరి ఈ మూటలేమిట్రా! ఎలా సంపాదించావు


లీలగారూ— పెళ్ళికాకముందు మా వాడు భలేగా నవ్వించేవాడు లెండి

## అందానికి 'బాలి' దీవులు...
## ఆనందానికి 'బాలి' కార్టూన్లు!



**తె**లుగు సంప్రదాయాలను... జీవనశైలిని తమ చిత్రాల్లో ప్రతి ఫలింప చేస్తున్న అగ్రశ్రేణి చిత్ర కారుల్లో 'బాలి' ఒకరని మనకు తెలుసు.

బాలికి ముందూ, తర్వాత హేమా హేమీలు ఉండొచ్చుగాక. 'బాలి' స్థానం బాలిదే. బాలి బొమ్మలు బాలివే. బాలి ప్రత్యేకత బాలిదే. ఎన్నడో 45ల్లో, బెల్లానికి ప్రసిద్ధి చెందిన అనకాపల్లిలో పుట్టిన బెల్లపుముక్కలాంటి కుర్రాడొకడు దేశాని కంతటికీ కావల్సిన బొమ్మలు, కార్టూన్లు, డిజైన్లు అందిస్తాడని ఎవరూహించారు?

వేలాది రేఖాచిత్రాలు, కార్టూన్లు, కవర్‌డిజైన్లు, అనేక పురాణ గాథలకు వేసిన అద్భుతమైన బొమ్మలతో ఓ ఖజానా సృష్టించిన బాలి ఆబాలగోపాలాన్ని ఆనందింపచేస్తున్నారు. తనదైన ముద్రని ఏనాడో సృష్టించుకున్నారు. పాఠకులను పరవశింప చేస్తున్నారు. భావదృష్టి, రేఖాపుష్టి సమృద్ధిగా గల బాలి తెలుగు ఇల్లాళ్లు, మధ్యతరగతి జీవులు, కన్నెఈడు అమ్మాయిలు, ఆఫీసు ఉద్యోగులు, సిసింద్రీ చందూల బొమ్మలు వేసి ప్రజల జీవితాన్ని పలుకోణాల్లో రేఖామాత్రంగా స్పృశించారు. ఇందులో ఎవరిలోనూ బాలిని పోల్చుకోకూడదు. ఎవరికి ఎవరూ పోటీకాదు. కాకపోతే సృష్టిలో తరతమ స్థాయీ భేదం మినహా మరేమీ లేదు. సౌకుమార్యానికి, సున్నితత్వానికి ప్రతీకగా బాలి బొమ్మలు నిలుస్తాయి.




'ఈనాడు' తెలుగు దినపత్రికకు తొలికార్టూనిస్టుగా మొదలు కొని ఈనాటివరకు ఆయన వేసిన కార్టూన్లలో అదే ప్రత్యేకత.

సేమియాలు తీగపోసినట్టుండే ఇండియన్ ఇంకు గీతలు, స్మూత్‌గా ఉండే బ్రష్ స్ట్రోక్ (ఆయన స్వభావం మాదిరే) అన వసరపు గీతల్లేని అనాటమి, నమ్మబుద్ధికాని బ్రిల్‌కలరు (చిత్ర కళలో అన్నిరకాల టెక్నిక్‌లూ ఆయన సృజించినా నల్లటి గీతలు, బ్రిల్‌కలర్లూ మాత్రం ఆయన ప్రత్యేకం) అబ్బో ఆ ప్రపంచమే వేరు. అక్షరాలకు మాదిరిగా బొమ్మలకూ ఓ ఫాంటు పెట్టినట్టు పొందికగా తీర్చిదిద్దిన ఆ కంపోజిషన్ చూస్తుంటే ముచ్చటేస్తుంది.

బొమ్మలకి (ఇలస్ట్రేషన్స్‌వేసేపద్ధతికీ) కార్టూన్లకు (అవి వేసేపద్ధతికి) తేడా బాలికి బాగా తెలుసు. బొమ్మల్లో ఎక్కడా కార్టూన్ల పోలికగాని, కార్టూన్లలో ఎక్కడా ఇలస్ట్రేషన్ రేఖా విన్యాసం గానీ కనిపించవు.

పవర్‌ఫుల్ మీడియం అయిన కార్టూన్‌ని బాలి లాంటి చేయితిరిగిన చిత్ర కారులు పూర్తిస్థాయిలో ఉపయోగించడం లేదేమో నని అప్పుడప్పుడు అనిపించినా, బొమ్మల్లోగాని, అనాటమీలోగాని, ప్రమాణాల్లోగానీ, రేఖల్లోగానీ ఏ విదేశీ చిత్రకారులకు తీసిపోడనే నిజం మాత్రం సంతోషం కలిగిస్తుంది. కార్టూన్లే కాదు బాలి చిత్రా లు, పెయింటింగులు, ఆఖరికి అక్షరాలు కూడా తెలుగువారికి సంపదే.



అందానికి 'బాలి' దీవులు. ఆనందానికి 'బాలి' కార్టూన్లు . సముద్రంలో కొట్టుకు పోయేవాడికి దీవి ఎంత ఆసరానో, రొటీన్ సముద్రంలో కొట్టుకుపోయే మనకు బాలి కార్టూన్లు కూడా అంతే!

**–శేఖర్,కార్టూనిస్టు**

# ఈ లోకం ఇంతేనయా...!

Bali




Owned & Published by : Ramu Panda from D.No.8-215/4, Yerrabalem, Guntur Dist.
Printed at: Chaitanya Offset printers, Vijayawada.-2 Edited by.Ramu.P